మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట






మీడియా సెంటర్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

## మీడియా సెంటర్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

**నారాయణ పేట, డిసెంబరు 3 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ ప్రజావాణి హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీసెల్‌ను జిల్లా ఎన్నికలఅధికారి,కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పరిశీలించారు. ఎంసిఎంసి కేంద్రంలో జరుగుతున్న నిఘా చర్యలు, మీడియా పర్యవేక్షణ, ప్రచార సామగ్రి పరిశీలన, సర్టిఫికేషన్ విధానాలపై అధికారులు వివరాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్, కేంద్రంలోని రికార్డులను పరిశీలించి ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరీక్షి ంచాలని సూచించారు. తదుపరి కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన కలెక్టర్, ఎన్నికలతో సంబంధం ఉన్న ఫోన్ ఫిర్యాదులు, సమాచారం, సందేహాలు ఏవైనా అందాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కాలంలో ప్రజలకు అందించే సేవలపై, ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని ఆమె అధికారులను ఆదేశించారు.



ఊరేగింపుగా తీస్తున్న శ్రీ తిమ్మప్ప స్వామి తెప్పోత్సవం

## కన్నుల పండుగగా శ్రీ తిమ్మప్ప స్వామి తెప్పోత్సవం

**మల్దకల్ డిసెంబర్ 3, ప్రభాతవార్త:** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో బుధవారం సాయంత్రం స్వామివారి తెప్పోత్సవం కోనేరులో అంగరంగ వైభవంగా జరిగింది. వందలాదిమంది భక్తులు రాగా కోనేరులో హంస వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని తెప్పోత్సవాన్ని ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు సత్య చంద్రారెడ్డి అర్చకులు వాల్మీకి పూజారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం శేష వాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్వారి అరవిందరావు అనిల్ సీతారాం రెడ్డి మధుసూదన్ రెడ్డి చంద్రశేఖర రావు రామచంద్రారెడ్డి ఆర్యవైశ్య నాయకులు శ్రీనివాసులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించిన ఎస్పీ జానకి

**బాలానగర్, డిసెంబరు 3 ప్రభాతవార్త :** బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైన బాలనగర్, పెద్దరేవల్లి పోలింగ్ కేంద్రాలను బుధవారం జిల్లాఎస్పీ డి.జానకి సందర్శించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిస్థితులు, ఎన్నికల ఏర్పాట్లు, స్థానికుల భద్రతపై అధికారులకు ప్రత్యేక సూచనలు చేశారు. నామినేషన్ కేంద్రాలలో సౌకర్యాలపై సిబ్బందితో కలిసి ఆరా తీశారు. ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా ప్రతి ఓటరు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేటట్లు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగార్జున, ఎస్సై లెనిన్ గౌడ్, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాలి: మంత్రి



క్రీడాకారులతో మంత్రి డా. వాకిటి శ్రీహరి

**మక్తల్‌టౌన్, డిసెంబరు 3 ప్రభాతవార్త :** రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీలలో ప్రతిభ చాటి నారాయణపేట జిల్లా కు మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ డెవలప్మెంట్, మత్స్య, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి సూచించారు. బుధవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అండర్ 14 బాలుర క్రికెట్ జట్టు భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో జరిగే ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడలకు తరలివెళ్ళారు. అంతకుముందు అండర్ 14 క్రికెటర్లు మక్తల్‌లోని మంత్రి నివాసంలో ఆయనను కలిశారు. ఈసందర్భంగా క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ మీకు అవసరమైన సదుపాయాలు అన్ని నేను కల్పిస్తానని రాష్ట్రస్థాయిలో మంచి ప్రదర్శన కనబరచాలని తెలిపారు. క్రికెటర్లకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ వెంకటేష్ శెట్టి, క్రీడా దుస్తువుల దాత లక్ష్మీ మనారాయణ, టీం మేనేజర్ విష్ణువర్ధన్, కోచ్ వలియోద్దీన్ పాల్గొన్నారు.

# పర్మిషన్‌లేని పర్మిట్‌రూంలు



- అనధికార బిల్డింగ్‌లు, షెడ్లలో వైన్‌షాపులు?
- భూత్పూర్ పట్టణ కేంద్రంలో నిబంధనలకు నీళ్లొదులుతున్న వైన్‌షాపుల నిర్వహకులు
- అనుమతించని పర్మిట్‌రూంలలో నాణ్యతలేని ఆహారాల సరఫరా?
- రాత్రి పదిదాటితే బెల్టుషాపుల్లో బాహాటంగా అధిక ధరలకు మద్యం విక్రయాలు
- గ్రామాల్లో ఎన్నికల్ కోడ్‌ను ఉల్లంఘిస్తున్న మద్యం విక్రయదారులు
- భూత్పూర్‌లో వైన్‌షాపుల నిర్వహణ,నిర్వాహకం
- ఛోద్యం చూస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు..పోలీసులు

**భూత్పూర్, డిసెంబర్ 3,ప్రభాతవార్త :** భూత్పూర్ వైన్‌షాపుల నిర్వహణకు కొత్తగా లాటరీద్వారా ఎంపికైన నిర్వహకులు ఎక్సైజ్‌శాఖ నిబంధ నలకు నీళ్లొదులుతున్నారు. హైవేలకు ఆరకిలోమీటరు దూరంలో వైన్‌షాపులనేర్పాటు చేయాలన్న నిబంధనలు భూత్పూర్ పట్టణ కేంద్రంలో ఎక్కడా కన్పించడంలేవు. భూత్పూర్ పట్టణానికి లాటరీద్వారా ఎంపికైన మూడు వైన్‌షాపులు ఎక్సైజ్ నిబంధనలు పాటించడం లేదనే ఆరో పణలు బాహాటంగా వినవస్తున్నాయి. భూత్పూర్‌లో కొన్ని అనధికార బిల్డింగ్‌లు, షెడ్లలో వైన్‌షాపులు నిర్వహిస్తున్నట్లు కూడా ఆరోపణలు లేకపోలేవు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన గోకుల్ వైన్స్ కమర్షియల్ షాపులకు కేవలం నిర్మాణ అనుమతులు తప్ప షాపులకు టాక్స్‌లు కానీ నిర్దిష్టమైన అనుమతులు లేవని తెలుస్తోంది. అయితే ఇక్కడ ఏర్పాటు చేసిన వైన్‌షాపునకు పర్మిట్‌రూం నిర్మాణానికి కూడా అనుమతిలేదని సంబంధిత మున్సిపల్‌శాఖ అధికారులు చెబుతున్నారు. పట్టణంలో అనుమతి లేకుండా, షాపుల పన్నులు చెల్లించకుండా అక్రమంగా నడుపుతున్న మూడు వైన్‌షాపులకు నోటీసులు కూడా జారీ అయ్యాయి. పట్టణంలోని భవాని వైన్‌షాపు భవనానికి పర్మిషన్ ఉన్నా..పర్మిట్ రూం అనధికారంగా నడుస్తున్నట్లు తెలుస్తోంది. అయితే జైమాత లిక్కర్ మార్ట్ వైన్‌షాపునకు షెడ్, పర్మిట్‌రూం అనుమతులు లేవని తెలుస్తోంది. ఈ షాపు స్థలవివాదంలో ఉండి కోర్టులో కేసు నడుస్తోందని తెలిసింది. పర్మిషన్‌లేని పర్మిట్‌రూంలలో స్టఫ్(తినుబండారాలు)నాణ్యత లేనివిగా ఉంటున్నాయని మందుబాబులు ఆరోపిస్తున్నారు. ఈ తినుబండారాల విక్రయాలలో ప్రధానంగా అధికార, ప్రతిపక్ష పార్టీల చోటా మోటా నాయకులు, కార్యకర్తల జోక్యమున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇక భూత్పూర్ మండలంలో బెల్టుషాపులు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయనే చెప్పాలి. వీధి వీధికో బెల్టుషాపు నిర్వహిస్తున్నారు. ప్రతీ కిరాణాషాపు, బడ్డీకొట్టు, హోటళ్లలో రాత్రివేళలో మద్యం లభిస్తోందంటే బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు ఏమాత్రం నిర్వహిస్తున్నారో ఊహించాలి. ఎక్సైజ్‌శాఖ -మిగతా3లో..

### నోటీసులు జారీ చేశాం :
**మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్**

అనుమతుల్లేకుండా వైన్‌షాపుల దుకాణాలకు టాక్స్‌లు చెల్లించకుండా, పర్మిషన్లు లేకండా పర్మిట్‌రూంలు, షెడ్లు నిర్మించుకుని విక్రయాలు జరుపుతున్న మూడు వైన్‌షాపులకు నోటీసులు జారీ చేసినట్లు భూత్పూర్ పట్టణ మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్ తెలిపారు. తామిచ్చిన నోటీసులకు ఆయా వైన్‌షాపుల యజమానులు ఇంతవరకు సంజాయిషీ ఇవ్వలేదని కమిషనర్ నూరుల్ నజీబ్ స్పష్టం చేశారు.

### పర్మిషన్ తీసుకుంటామంటేనే అనుమితిచ్చాం :
**జడ్చర్ల ఎక్సైజ్ ఎస్సై శృతి**

వైన్‌షాపుల యజమానులు వారు నిర్వహించే బిల్డింగ్‌లు, షెడ్లకు తగిన అనుమతులు తీసుకుంటామంటేనే వైన్‌షాపులకు పర్మిషన్ ఇచ్చినట్లు జడ్చర్ల ఎక్సైజ్ ఎస్సై శృతి తెలిపారు. వారు నిర్వహిస్తున్న పర్మిట్ రూంల షెడ్లు, భవనాలకు తగన అనుమతులు లేవని తమ దృష్టికి రాలేదని, వారి నుంచి వెంటనే వివరణ కోరతామని, సరైన వివరణ లేకుంటే అనుమతిలేని పర్మిట్ రూంల నిర్వహకులపై తగిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్సై శృతి హెచ్చరించారు.

# ఎక్కడి వడ్లు అక్కడే...



వడ్ల సెంటర్ల దగ్గర వడ్లను ఆరబెట్టుకున్న రైతులు

### చేనుగోనిపల్లె సెంటర్లో నత్త నడకన సాగుతున్న తూకాలు...
### మొబ్బులు కమ్మిన మేఘాలు...
### వానలు వస్తే మా పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్న రైతులు ...

**గద్వాల టౌన్, డిసెంబర్ 03, ప్రభాతవార్త:** వడ్ల కొనుగోలు కేంద్రాలలో వడ్ల కుప్పలు ఎక్కడివి అక్కడే ఉన్నాయని, కుప్పలు పోసి రెండు రోజులు అయినా తూకాలు కావడం లేదని కొన్ని వడ్ల కొనుగోలు కేంద్రాలలో రైతులు వాపోతున్నారు. ఆకాశంలో మొబ్బులు కమ్ముకొస్తున్నాయని, ఎప్పుడూ వర్షం వస్తుందోనని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కొన్ని సెంటర్లలో హమాలీలు వుంటే లారీలు రావడం లేదు, లారీలు ఉన్నప్పుడు హమాలీలు దొరకడం లేదని, సెంటర్లలో నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవడము లేదని విమర్శలు వస్తున్నాయి. గద్వాల మండలం చేనుగోని పల్లె, నది అగ్రహారం గ్రామాలకు చెందిన వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పట్టణ శివారు నది అగ్రహారం వెళ్ళే రోడ్డులో సబ్ స్టేషన్ సమీపంలో గల చేనుగోని పల్లె సెంటర్లో రైతులు వడ్లు ఆరబెట్టుకునేందుకు, కుప్పలు పోసేందుకు స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 30 వేల రూపాయలు ఇచ్చి స్థలాన్ని అద్దెకు తీసుకుని కేంద్రాన్ని నడుపుతున్నట్లు సమాచారం. అయినా ఆ స్థలం సరిపోకపోవడంతో ఇండ్ల మధ్యలో వడ్లను ఆరబెట్టుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే 80 శాతం వరిపంటల కోతలు జరుగగా రైతులు ఎక్కువ మొత్తంలో వడ్లను సెంటర్లకు తరలిస్తున్నారు. ఇదిలా ఉండగా తూకాలలో సెంటర్ నిర్వాహకులు చేతివాటం చూపిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఒక్క బస్తాకు 41 కిలోలు నింపాల్సి వుండగా సంచి తూకం, తాళ్ళు, తరుగు అని కొన్ని సెంటర్లలో 41.300గ్రాములు, మరికొన్ని సెంటర్లలో 41.500గ్రాములు, ఇంకొన్ని సెంటర్లలో తరుగు పేరుతో ఏకంగా 42 కిలోలు కాంటా పడుతు న్నట్లు సమాచారం. నది అగ్రహారంలో మూడు సెంటర్లు -మిగతా3లో..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి

## ఆంటికరప్షన్ వీక్-2025 పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 3 ప్రభాతవార్త :** ఆంటికరప్షన్ వీక్-2025 సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వారాంతం పాటు జరగనున్న అవగాహన కార్యక్రమాలలో భాగంగా సిద్ధం చేసిన ఆంటికరప్షన్ అవగాహన పోస్టర్ కలెక్టర్ విజయేందిరబోయి ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వద్యోగులు, ప్రజలందరి మధ్య అవినీతిని నిర్మూలిం చేందుకు అవసరమైన అవగాహన, బాధ్యత, పారదర్శకతను పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. నిరంతర అవగాహన, నైతిక విలువలు, ప్రజల భాగస్వామ్యం ద్వారా ప్రభుత్వ వ్యవస్థల్లో నిజాయితీ, సమగ్రత మరింత బలపడుతుందని తెలిపారు. ఆంటికరప్షన్ బ్యూరో, మహబూబ్‌నగర్ రేంజ్ ఈవారంలో అనేక కార్యక్రమాలు చేపట్టింది. అవగాహన డ్రైవ్ లు, పోస్టర్ల పంపిణీ, ప్రభుత్వ కార్యాలయాల్లో అవుట్‌రీచ్ కార్యక్రమాలు, సిబ్బంది ప్రజలకు అవగాహన సెషన్లు నిర్వహించడం వంటివి ఇందులో భాగం. అవినీతి చర్యలను అరికట్టడం, ప్రజల్లో అప్రమత్తతను పెంచడం, అవినీతి రహిత పరిపాలన సమాజ ఆర్థికాభివృద్ధికి కీలకమని తెలియజేయడం ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యం. కలెక్టరేట్‌కు చెందిన పలువురు అధికారులు, అలాగే ఎసిబి ఇన్స్‌పెక్టర్లు ఎస్ఎ ఖాదర్ జిలాని, పి.లింగస్వామి ఇతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



చెక్‌పోస్టులను తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ

## బోర్డర్ చెక్‌పోస్టులను సందర్శించిన జిల్లా ఎస్పీ

**నారాయణ పేట, డిసెంబరు 3 ప్రభాతవార్త :** నారాయణ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను జిల్లా ఎస్పీ డా.వినీత్ ఆకస్మికంగా పరిశీలించారు. ఎన్నికల కాలంలో భద్రతా చర్యలు బలోపేతం అయ్యాయా అనే దానిపై ఆయన ప్రత్యక్షంగా సమీక్ష నిర్వహించారు. నారాయణపేట మండలంలోని జలాల్పూర్ చెక్‌పోస్ట్‌తో పాటు దామరగిద్ద సమీపంలోని కానుకుర్తి బోర్డర్ చెక్‌పోస్ట్‌ను కూడా ఎస్పీ పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉన్నపోలీస్ అధికారులు, సిబ్బంది, ఎస్ఎస్‌టిటీమ్‌లతో మాట్లాడిపరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అక్రమరవాణా, మద్యం, డబ్బు, బంగారం మరియు ఎన్నికలను ప్రభావితం చేసే ఇతర నిషేధిత వస్తువులు జిల్లా పరిధిలోకి చొరబడకుండా ప్రతి వాహనాన్ని జాగ్రత్తగా తనిఖీ చేయాలని ఎస్పీ ఆదేశించారు. వాహనాల వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. అదేవిధంగా అనుమానాస్పద వాహ నాలు, వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలని, అవసరమైతే తనిఖీలు వీడియో రికార్డింగ్‌తో జరపాలని సూచించారు. జిల్లాలో మొత్తం ఆరు బోర్డర్ చెక్‌పోస్టులు, ఐదు ఎస్ఎస్‌టి టీమ్‌లు ఎన్నికల కోసం పనిచేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. సరిహద్దు మార్గాలతో పాటు గ్రామాల అంతర్గత రహదారులపై కూడా కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని చెప్పారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిస్పక్షపాతంగా జరగడానికి పోలీసులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారని ఎస్పీ డా.వినీత్ పేర్కొన్నారు.

### విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించేలా
## ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలి




విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్

**లింగాల, డిసెంబరు 3 ప్రభాతవార్త :** విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా నాణ్యమైన బోధన అందాలని నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రమేష్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం లింగాల మండలంలోని దత్తారం, కోమటికుంట, అసులకుంట, అంబటిపల్లి, షాహీన్ పేట ,ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, లింగాల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, పాఠశాలలను డిఈవో రమేష్ కుమార్ తనిఖీ చేశారు. ఉన్నత పాఠశాలలను సందర్శించి సబ్జెక్టులలో గల సిలబస్ పూర్తిగా అయ్యాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో మధ్యాహ్న భోజనం వివరాలపై అడిగి తెలుసుకొని విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మకమైన విద్య బోధన అందించడంతో పాటు సమయానికి నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలల తరగతి గదులు, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచి, పిల్లలకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని, పరీక్షల సమయం సమీపిస్తున్న తరుణంలో ఉత్తీర్ణత శాతం మెరుగు పర్చుటకు ప్రత్యేక క్లాసులను నిర్వహించి, విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంచుటకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వారి అభ్యున్నతికి పాటుపడాలని ఉపాధ్యాయులను డిఇఓ ఆదేశించారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. కేజీబీవీ విద్యార్థుల ఇంటర్, పదో తరగతి సబ్జెక్టుల్లో సామర్థ్యాలను పరిశీలించి సలహాలు సూచనలు అందజేశారు. మార్చి 16 నుంచి 10వ తరగతి పరీక్షలు ఉన్నందున, మెరుగైన ఫలితాలు సాధించేందుకు సబ్జెక్టు ఉపాధ్యాయులందరూ సమిష్టిగా కృషి చేయాలని డిఇఓ సూచించారు. విద్యార్థులను సన్నద్ధం చేయాలని, ప్రతి పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలని డిఇఓ సూచించారు. విద్యార్థులను పరీక్ష కాలపరిమితిలో సమాధానాలు రాసేలా ప్రతిరోజు కొంత సమయంలో చిన్న చిన్న పరీక్షలు నిర్వహించి సన్నద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం అవసరమైన అన్ని పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించాలని, ప్రతి రోజూ ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలిక విద్యాభివృద్ధి అధికారిని శోభారాణి, లింగాల మండల విద్యాధికారి బషీర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్





నామినేషన్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

**శ్రీరంగాపూర్, డిసెంబరు 3 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీఎన్నికల్లో భాగంగా నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థులు కావలసిన ధ్రువ పత్రాలు అన్ని ఇచ్చారో లేదు సక్రమంగా చూసుకోవాలని రిటర్నింగ్ అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం ఉదయం మూడో దశ గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా పెబ్బేరు, శ్రీరంగాపూర్, వీపనగండ్ల, చిన్నంబావి, పాన్‌గల్ మండలాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం అయింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ శ్రీరంగాపురం మండలం కంబాలపురం గ్రామపంచాయతీ కార్యాలయం, శ్రీరంగాపురం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థులు కావలసిన ధ్రువపత్రాలు అన్ని ఇచ్చారో లేదో సక్రమంగా చూసుకోవాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. సర్పంచ్ గాని, వార్డు మెంబర్ గానీ పోటీ చేయు అభ్యర్థికి ప్రతిపాదించే వ్యక్తి ఏ కులం వారైనా అయి ఉండొచ్చని అందులో సందేహం అవసరం లేదని సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల్లో ఓటర్ జాబితాను ప్రదర్శించాలని సూచించారు. అన్ని నామినేషన్ స్వీకరణ కేంద్రాల్లో ఫారం 1 ప్రచురణ చేశారా లేదా అని కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రతిరోజు నామినేషనులు స్వీకరించిన అనంతరం సాయంత్రం టి పోల్ యాప్ లో అప్డేట్ చేయాలని సూచించారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు ఒక ప్రపోజర్, మరొకరు లేదా ఇద్దరు మాత్రమే రిటర్నింగ్ అధికారి గదిలోకి అనుమతించాలని సూచించారు. కలెక్టర్ తో పాటు శ్రీరంగాపూర్ మండల తహసిల్దార్ రాజు, ఎంపీడీవో రవి నారాయణ తదితరులు ఉన్నారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన సీఐ

**ఉప్పునుంతల, డిసెంబరు 3 ప్రభాతవార్త :** మండలంలో ఈనెల 17న జరగబోవు గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా బుధవారం నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. నామినేషన్ కేంద్రాలను అచ్చంపేట సీఐ నాగరాజు, ఉప్పునుంతల ఎస్సై వెంకట్ రెడ్డిలు సందర్శించారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాలలో మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రిటర్నింగ్ అధికారులు నియమ నిబంధనలు పాటించాలని సూచించారు.



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన అచ్చంపేట సీఐ నాగరాజు

మండలంలో 27 గ్రామ పంచాయతీలు, 222 వాడు మెంబర్లకు జరగబోయే ఎన్నికలకు 7 క్లస్టర్లుగా నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. శాంతియుత ఎన్నికల కోసం బందోబస్తు నిర్వహించడం జరిగిందని , ఉప్పునుంతల ఎస్సై వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని, రెచ్చగొట్టే వాక్యాలు చేసిన వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అచ్చంపేట సీఐ నాగరాజుతో పాటు ఉప్పునుంతల ఎస్సై వెంకట్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ షాకీరర్ ఉసేన్, పోలీస్ సిబ్బంది, ఆర్వోలు, ఏఆర్వోలు పాల్గొన్నారు.

## ధర్నాకు బయలుదేరిన జర్నలిస్టులు

**నారాయణపేట,డిసెంబరు3 ప్రభాతవార్త :**నారాయణ పేట జిల్లా జర్నలిస్టులు అక్రిడిటేషన్ సమస్య,జర్నలిస్టుల సంక్షేమ పథకాల అమలు, విద్య-వైద్యం-ఇండ్ల స్థలాల వంటి ప్రాథమిక అవసరాల సాధన కోసం హైదరాబాదులో బుధవారం నిర్వహించిన ధర్నాలో పాల్గొనడానికి నారాయణపేట జిల్లాకు చెందిన వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ టియుడబ్ల్యూజే ఐజెయు సభ్యులు బయలుదేరారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి మాట్లాడుతూ గత మూడు



ధర్నాకు బయలుదేరిన వెళ్తున్న జర్నలిస్టులు

సంవత్సరాలుగా జర్నలిస్టులకు ప్రభుత్వం అక్రిడిటేషన్ ఇవ్వకపోవడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని పేర్కొన్నారు. ఎన్నిసార్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసు రెడ్డికి వినతిపత్రాలు అందించినప్పటికీ ఫలితం లేకపోవడం అత్యంత నిరాశాకరమని భావిస్తున్నామన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోవడం లేదు. మీడియా ఉద్యోగులకు అవసరమైన విద్య, వైద్యం, ఇండ్ల స్థలాల వంటి హక్కులపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు జర్నలిస్టులందరం కలిసి ఈ ధర్నాలో పాల్గొన్నట్లు తెలిపారు.

## ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

**ఉప్పునుంతల, డిసెంబరు 3 ప్రభాతవార్త :** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమానికి జిల్లా హెచ్ఎంల సంఘం అధ్యక్షుడు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాధికారి చంద్రశేఖర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.ఈసందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ దివ్యాంగులు ప్రభుత్వం అందించే అన్ని



పాఠశాలలో దివ్యాంగులకు సామగ్రి పంపిణీ

రకాల విద్యా సదుపాయాలను సద్విని యోగం చేసుకోవాలని వారు సూచించారు. దివ్యాంగులు సాధారణ పిల్లల వలె సాధారణ పాఠశా లలో చదువుకునే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా దివ్యాంగుల కో సం ప్రభుత్వం విద్యాపరంగా కల్పిస్తున్న సౌకర్యాలను , రాయితీల గురించి ప్రత్యేక విద్య ఉపా ధ్యాయులు కడుకుంట్ల రాజా వర్ధన్ రెడ్డి, సంగీత, విజయ్‌కుమార్‌లు వివరించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా గజిటెడ్ హెచ్ఎంల సంఘం అధ్యక్షుడు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యా ధికారి చంద్రశేఖర్, ఆ పాఠశాల హెచ్ఎం సభావట్ బిచ్చ నాయక్, ప్రత్యేక విద్యా ఉపాధ్యాయు లు రాజా వర్ధన్ రెడ్డి, సంగీత, ఐఈఆర్ పి.విజయ్ కుమార్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ తిరుపతి, సిఆర్పి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

**ఆత్మకూర్ డిసెంబర్3, ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి వర్తక సంఘం ఆధ్వర్యంలో బుధవారం రోజు పట్టణంలోని గాంధీ చౌరస్తాలో పాలాభిషేకం నిర్వహించారు. ఈనెల 1వ తేదీన ఆత్మకూర్ నుండి గద్వాల్ వెళ్లేందుకు కృష్ణానదిలో హై లెవెల్ మృతి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ముఖ్యమంత్రికి చిత్రపటానికి మరియు ఉత్తంకుమార్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా మాట్లాడుతూ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా తీవ్రంగా నష్టపోయిన ఆత్మకూరు పట్టణానికి పూర్వవైభవం తీసుకువచ్చేవి కార్యక్రమంలో భాగంగా హై లెవెల్ ప్రతినిర్మానం శంకుస్థాపనతో పాటుగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రజా పాలన ప్రభుత్వానికి రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో మద్దతు పలికి ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ వర్తక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ సెంటర్లను సందర్శించిన జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి

**వీపనగండ్ల డిసెంబర్ 3, ప్రభాతవార్త:** మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ పర్వం బుధవారం రోజు ప్రారంభమైంది. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా ఎస్పీ సునీతారెడ్డి మండలంలోని గోవర్ధనగిరి క్లస్టర్ సెంటర్‌ను ఆమె సందర్శించి వీపనగండ్ల ఎస్ఐ కె రాణితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ సెంటర్లో నామినేషన్స్ సజావుగా జరిగే విధంగా చూడాలని ఆమె ఎస్ఐ కే రాణి కి సూచించారు. బందోబస్తు



క్లస్టర్ గ్రామాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ

విషయంలో కఠినంగా ఉండాలని ఆమె సూచించారు. అదేవిధంగా ఆమె మాట్లాడుతూ జిల్లా మొత్తంలో 60 గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించడం జరిగిందని ఆమె తెలిపారు. అదేవిధంగా మూడవ విడత లో జరిగే ఎన్నికలకు 600 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రతి నామినేషన్ వేసే సెంటర్లో వన్ ప్లస్ వన్ సిబ్బందిని నియమించినట్లు ఆమె తెలిపారు. అంతేగాక ఎక్కడ ఏమైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె ఈ సందర్భంగా తెలియజేశారు. ఆమె వెంట డిఎస్పి వెంకటేశ్వర్‌రావు, వెంకటేశ్వర్ రెడ్డి సిబ్బంది ఉన్నారు.

## మంత్రి సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేరికలు

**మక్తల్ టౌన్, డిసెంబరు 3 ప్రభాతవార్త :** మంత్రి వాకిటి శ్రీహరి సమక్షంలో మక్తల్ మండలం రుద్ర సముద్రం గ్రామానికి చెందిన పలువరు బీఆర్ఎస్, బిజెపి కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వాకిటి శ్రీహరి నియోజకవర్గానికి మంత్రి చేస్తున్న అభివృద్ధిని చూసి తాము కాంగ్రెస్



మంత్రి వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న దృశ్యం

పార్టీకి ఆకర్షితులమై పార్టీలో చేరామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపిస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. మంత్రి శ్రీహరి నియోజకవర్గానికి చేస్తున్న అభివృద్ధిలో తాము పాలు పంచుకుంటామన్నారు.

# వైకల్యం శరీరానికే గానీ మనసుకు కాదు

### అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.అవినాష్

**నారాయణ పేట, డిసెంబరు 3 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో రొనాల్డో మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.అవినాష్ పాల్గొన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఆయన పిలుపునిచ్చారు. వైకల్యం శరీరానికే నని, మనసుకు కాదని, పట్టుదల ఉంటే దివ్యాంగులు కూడా ఉన్నత లక్ష్యాలు సాధించగలరని పేర్కొన్నారు. దివ్యాంగుల సమస్యలు సామాజిక ప్రతిబంధకాలను అర్థం చేసుకుని వారికి తోడుగా నిలవడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. అదే విధంగా,మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, నాటు వైద్యంపై ఆధారపడకుండా ప్రభుత్వ వైద్యసేవలను వినియోగించుకోవాలని సూచించారు. మనిషిని అడ్డుకునేది వైకల్యం కాదు, వదిలేయాలనే బలహీనత మాత్రమేనని సందేశమిచ్చారు. దివ్యాంగుల పట్ల గౌరవం సానుభూతి పెంపొందించి విద్యా,ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జడ్జి అభినందించారు. ఉచిత న్యాయ సహాయం కోసం 15100 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సేవలు పొందవచ్చని ప్రజలను అవగాహన చేసుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, పాఠశాల సిబ్బంది, పారాలీగల్



మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.అవినాష్

వాలంటీర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ఆత్మవిశ్వాసంతో వైకల్యాన్ని జయించాలి

**జిల్లా విలీన విద్య కోఆర్డినేటర్ సుధాకర్ రెడ్డి**

**నవాబుపేట, డిసెంబరు 3 ప్రభాతవార్త :** ఆత్మవిశ్వాసం ఉంటే వైకల్యాన్ని కూడా జయించవచ్చని జిల్లా విలీన విద్య కోఆర్డినేటర్ సుధాకర్ రెడ్డి అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ అర్బన్ భవిత కేంద్రంలో నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వైకల్యం అనేది శరీరానికి తప్ప మేధస్సు కాదని, ఎంతోమంది వైకల్యం కలిగి ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసంతో అద్భుత విజయాలు సాధించారని గుర్తు చేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులు వైకల్యం కలిగిన పిల్లలను



విద్యార్థులకు టిఫిన్స్ బాక్సులు అందజేస్తున్న దృశ్యం

ప్రోత్సహించి వారు కూడా సాదారణ పిల్లలవలే చదువుకునేలా చూడాలని అన్నారు. భవిత కేంద్రానికి వచ్చే ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, సాధారణ పాఠశాలకు వచ్చే వైకల్యం కలిగిన బాలికలకు స్టైఫండ్, ఇతరుల సహాయంతో బడికి వచ్చే వారికి ఎస్కార్ట్ అలవెన్స్, కంటిచూపు తక్కువగా ఉన్న విద్యార్థులకు రీడర్ అలవెన్స్ ఇచ్చి వారు కూడా చదువుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు. పూర్తిగా బడికి రాలేని వారికి ఇంటివద్దనే విద్య అందిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉచితంగా ఉపకారణాలను అందిస్తూ వారిని రోజు వారి కార్యక్రమాలు చేసుకునేలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకొని లబ్ధి పొందాలని సూచించారు ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ అర్బన్, మండల విద్యాధికారి లక్ష్మణ్ సింగ్, ప్రత్యేక ఉపాధ్యాయులు శ్రీనివాసులు, పావని, అశోక్ కుమార్, కృష్ణయ్య ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గ్రామాలలో పంచాయతీ అభ్యర్థుల ఎంపికలో వీడని పీఠముడి

### నాయకత్వానికి ప్రశ్నార్థకంగా ఆశావాహుల పోటీ

**ఉప్పునుంతల, డిసెంబరు 3 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి మొదలైన వెంటనే, అభ్యర్థుల ఎంపికలపై పీఠముడి ఎక్కడ చూసినా విపరీతంగా కనిపిస్తోంది. ప్రతి గ్రామంలోనూ పోటీ చేసేందుకు ముందుకు వస్తున్న ఆశావాహుల సంఖ్య పెరుగుతుండడంతో, నాయకులకు అభ్యర్థుల ఖరారు లో పెద్ద తలనొప్పిగా మారింది. ఎవరి పేరును ఖరారు చేసినా, మరొక వర్గం అసంతృప్తి వ్యక్తం చేసే పరిస్థితి నెలకొంది. మొదటి రోజు నామినేషన్‌ల ప్రక్రియ ఈ ఉత్కంఠ వాతావరణం కారణంగా మందకొడిగా సాగింది. చాలా గ్రామాల్లో పార్టీ అంతర్గత విభేదాలు గట్టిగా తలెత్తిన నేపథ్యంలో, పలువురు నాయకులు అభ్యర్థుల పేర్లను ప్రకటించడంలో జంకుతున్నారు.గత ఎన్నికల్లో ఓడిన వారే మళ్లీ రేసులో ఉండడం, ప్రస్తుతం అనేక గ్రామాల్లో గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులే మళ్లీ బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నారు. నాటి నుంచి నేటి వరకు పార్టీకోసం పని చేస్తూ వచ్చిన నాయకులను పక్కనబెట్టి, కొందరు కొత్త వ్యక్తులను ప్రోత్సహించేందుకు కొనసాగుతున్న సంఘటనతో కార్యకర్తల్లో కొంతమంది అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల నిర్వహించిన స్టీరింగ్‌కమిటీ సమావేశంలో అధిష్టానం మాత్రం స్పష్టంగా గతంలో పార్టీ తరపున పోటీ చేసి ఎదురు ఫలితం పొందినవారికి ఈసారి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించినట్లు సమాచారం. అయితే ఈ సూచనలను పట్టించుకునే నాయకులు ఎంతమంది ఉన్నారన్నదే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. నేతల కనుసన్నల్లో ఉన్న అభ్యర్థులకే ఆధిక్యం నాయకత్వంలోని కొంతమంది ప్రభావవంతులు మాత్రం తమ కనుసన్నలో ఉండే అభ్యర్థులకే అవకాశమివ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామ స్థాయిలో వర్గీకరణలు, లోబీ నిర్ణయాలు ఎన్నికల వాతావరణాన్ని మరింత క్లిష్టతరం చేస్తున్నాయి. పార్టీకోసం పనిచేసిన వారికి గుర్తింపు ఎక్కడ?" ఆశావాహుల ఆవేదన పార్టీ కోసం నిరంతరం శ్రమించిన, ఏనాడూ వెనక్కి తగ్గని కార్యకర్తలకు ఈ సారి అవకాశాలు తగ్గిపోతున్నాయన్న భావన ఆశావాహుల్లో ఆవేదనకు దారితీస్తోంది. పార్టీ కార్యక్రమాల్లో రాణించిన వారిని చూసే పరిస్థితి ఎక్కడ? కొత్తవారిని మాత్రమే ముందుకు తెస్తున్నారని అంటూ చాలామంది గుసగుసలాడుతున్నారు.ఎవరికి అవకాశం? గ్రామాలలో ఉత్కంఠ కొనసాగుతోంది. గ్రామాలవారీగా అభ్యర్థుల ఎంపికపై స్పష్టత రాకపోవడంతో, నాయకత్వ వర్గాలు, కార్యకర్తలు, స్థానిక ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. ఎవరి పేరును ప్రకటిస్తారో, ఎవరిని తప్పిస్తారో అన్న అంశంపై ఆసక్తి పెరిగింది. అభ్యర్థుల ఎంపికల్లో కొనసాగుతున్న ఈ పీఠముడి చివరకు ఎప్పుడు వీడుతుందో, పార్టీ లోపలి విభేదాలపై అధిష్టానం ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది.

# నామినేషన్ల స్వీకరణ పారదర్శకంగా నిర్వహించాలి

**అభ్యర్థులకు అనుమానాలు**

**ఉంటే హెల్ప్ డెస్క్ దగ్గర తెలుసుకోవాలి**

**రెవెన్యూ అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**

**పెబ్బేర్, డిసెంబరు 3 ప్రభాతవార్త :** గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎంతో పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని వనపర్తి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ పెబ్బేరు మండలంలోని రంగాపూర్, సూగూరు,జనుంపల్లి,శాఖాపురం క్లస్టర్లను సందర్శించి నామినేషన్ల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా క్లస్టర్ల రిటర్నింగ్ అధికారులతో మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. నామినేషన్లను స్వీకరించే ప్రక్రియ పూర్తయిన వెంటనే, నిర్ణీత గడువులోగా ఉన్నతాధికారులకు



తోమాలపల్లి గ్రామంలో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

నివేదిక సమర్పించాలని ఆదేశించారు. నామినేషన్లు వేయడానికి వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి అవసరమైన సమాచారాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ సేవలను నాణ్యతతో నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. పెబ్బేరు తహసీల్దార్ మురళి గౌడ్, క్లస్టర్ల రిటర్నింగ్ అధికారులు, స్థానిక రెవెన్యూ సిబ్బంది పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## నారాయణపేట జిల్లాలో రెండో దశ నామినేషన్ల

**నారాయణ పేట, డిసెంబరు 3 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా పంచాయతీ ఎన్నికల రెండో దశ నామినేషన్ల నమోదు ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. మొత్తం జిల్లాలో 95 గ్రామ పంచాయతీలు పోలింగ్‌కు ఇప్పటి వరకు సర్పంచ్ పదవికి 609 నామినేషన్లు దాఖలయ్యాయి. మండలాల వారీగా సర్పంచ్ నామినేషన్లు దామరగిద్ద: 164,ధన్వాడ 166, మరికల్ 104, నారాయణపేట 175 మొత్తం: 609వార్డు సభ్యుల నామినేషన్లు.జిల్లాలో మొత్తం 900 వార్డులు పోలింగ్ కోసం ఇప్పటి వరకు 2063 నామినేషన్లు దాఖలయ్యాయి. దామరగిద్ద 566, ధన్వాడ 526, మరికల్ 412, నారాయణపేట 563 మొత్తం 2063ముఖ్యంగా దామరగిద్ద నారాయణపేట మండలాల్లో నామినేషన్ల సంఖ్య ఎక్కువగా ఉండటం ఎన్నికల వేడి పెరిగిందనడానికి సంకేతంగా కనిపిస్తోంది. మొదటి విడత ఎన్నికలు జరగనున్న గ్రామపంచాయతీల్లో ప్రధాన పార్టీల మధ్యకు కొందరు నేతలు తిరుగుబాటు భంగిమలో దిగుతున్నారు. కొంతకాలంగా సర్పంచ్ పదవిపై ఆశలు పెంచుకున్న వీరికి కావాల్సిన టిక్కెట్లు రాకుండా పోవడంతో ఆయా పార్టీల్లో సందిగ్ధ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ అసంతృప్తి కారణంగా కొందరు నాయకులు తిరుగుబాటు నిర్ణయానికి వెళ్తున్నారు. పార్టీలు ఒప్పించే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, అసంతృప్తుల నిర్ణయాల్లో మార్పు కనిపించడం లేదు. కొంతమంది నేతలు తమ వర్గాలతో సమావేశాలు జరుపుతూ స్వతంత్రంగా పోటీ చేసే అవకాశాలు పరిశీలిస్తున్నారు. దీంతో గ్రామస్థాయిలో పోటీ వాతావరణం మరింత హీట్ పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. పార్టీ అగ్రనేతలు జోక్యం చేసుకోనిచో పరిస్థితులు మరింత క్లిష్టం అవుతాయని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### నామినేషన్లు వేసిన అభ్యర్థులను

## ప్రలోభాలకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు: గద్వాల సీఐ

**గద్వాల టౌన్ డిసెంబర్ 3, ప్రభాతవార్త:** నియోజకవర్గ పరిధిలో మొదటి విడత సర్పంచ్ నామినేషన్ల ప్రక్రియలో గద్వాల,ధరూర్,కేటి దొడ్డి,గట్టు నవంబర్ 29తేధిన ముగియగా రెండో విడతలో మల్దకల్ మండలం నిన్నటితో నామినేషన్ల పర్వం ముగిసింది..కగా గద్వాల సర్కిల్ పరిధిలో అయిదు మండలాల్లో కలిపి 132పంచాయతీలకు గాను సర్పంచ్ అభ్యర్థులు,వార్డు నెంబర్లు నామినేషన్లు వేశారు..ఈ సందర్భంగా గద్వాల సర్కిల్ ఇనస్పెక్టర్ టంగుటూరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ గద్వాల సర్కిల్ పరిధిలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నాదని ఎవరైన సరే ఎన్నికల నియమావళిని అనుసరించాలని ఎన్నికల్లో నిలబడిన అభ్యర్థులను ఎవరైన ప్రలోభాలకు గురిచేసిన,నామినేషన్ల వెనుకకు తీసుకోవాలని భయపెట్టిన అట్టి వారిపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు..ఎన్నికలు జరిగే ఆయా గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వేచ్ఛ వాతావరణంలో ఓట్లు వేయడానికి అభ్యర్థులతో పాటు వార్డు మెంబర్లు సహకరించాలని కోరుతూ గద్వాల సర్కిల్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికలను జరిగే విధంగా అందరు సహకరించాలని తెలుపుతూ



గద్వాల సిఐ టంగుటూరి శ్రీనివాస్

మీ గ్రామాల్లో ఎవరైన ప్రలోభాలు,భయాందోళనలు, ఇబ్బందులు గురిచేసిన మీ మండలాల ఎస్ఐ నెంబర్లకు తెలపాలని, గద్వాల పోలీసులు మీకు ఎళ్ళవేళలా అందుబాటులో ఉంటారని గద్వాల సీఐ టంగుటూరి శ్రీనివాస్ పేర్కొన్నారు.

## జాతరలో మంచినీటి సరఫరా ప్రారంభం

**మల్దకల్ డిసెంబర్ 3, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో స్వయంభు లక్ష్మి వెంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా బుధవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మూడు ట్రాక్టర్ల తో మంచినీటి సరఫరా చేస్తున్నారు. ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు,ఈవో సత్య చంద్ర రెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. మూడు రోజులపాటు జాతరలో భక్తులకు మంచినీరు సరఫరా చేస్తారు.ఈ కార్యక్రమంలో తాటికుంట మధుసూదన్ రెడ్డి. నరేందర్ చంద్రశేఖర్ రెడ్డి. ఆలయ పూజారు యూనియన్ బ్యాంకు మేనేజర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మంచినీటి సరఫరాను ప్రారంభం చేస్తున్న దృశ్యం

## ఘనంగా శ్రీకాంతాచారి వర్ధంతి



శ్రీకాంత్‌చారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**వెల్దండ, డిసెంబర్ 03 ప్రభాతవార్త:**మండల కేంద్రంలోని బ్రహ్మగిరి దేవాలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరవీరుడు కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు అన్నదానం కృష్ణయ్య చారి, పాండురంగ చారి, జంగాచారి, రామాచారి, రామకృష్ణ చారి, శోభన్‌బాబు, పురుషోత్తంచారి, జగన్‌చారి, శ్రీశైలంచారి, రమేష్ చారి తోపాటు తదితరులు ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

**-అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

**వంగూరు, డిసెంబర్ 03 ప్రభాతవార్త:**వంగూరు మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎదురు పుల్లయ్య మృతి చెందారు. విషయం తెలుసుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మృతుడి గృహానికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడు కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉండి ఆదుకుంటామని ఎమ్మెల్యే వంశీకృష్ణ హామీ ఇచ్చారు. అనంతరం రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. అయన వెంట కాంగ్రెస్ నాయకులు అల్వాల్ రెడ్డి, రమేష్ గౌడ్, జయ ప్రకాష్ రావు, చంద్రశేఖర్, శంకర్, గఫూర్, జనార్ధన్, శ్రీను, సైదులు తదితరులున్నారు.

## మూడవ విడతలో రెండు నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న వల్లభాపురం సర్పంచ్ అభ్యర్థిగా స్వరాజ్యలక్ష్మి

**వీపనగండ్ల డిసెంబర్ 3, ప్రభాతవార్త:** మండలంలోని 14 గ్రామపంచాయతీ లలో తూముకుంట వల్లభాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థులుగా ఇద్దరు నామినేషన్లు వేయడం జరిగిందని వీపనగండ్ల ఎన్నికల అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. తూముకుంట క్లస్టర్ సెగ్మెంట్లో తూముకుంట గ్రామానికి చెందిన సారంగ జయప్రకాష్ అలియాస్ జయ బొల్లారం క్లస్టర్ సెగ్మెంట్ నామినేషన్ సెంటర్లో వల్లభాపురం గ్రామపంచాయతీకి చెందిన గుంత స్వరాజ్యలక్ష్మి సర్పంచ్ అభ్యర్థిగా వేయడం జరిగిందని ఆయన తెలిపారు. మొదటి విడతలో నామినేషన్లు సజావుగా జరగడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ నామినేషన్ల పర్వము నాలుగు ఐదు తేదీల్లో కూడా కొనసాగుతుందని ఆయన తెలిపారు.

## దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా ఆటల పోటీలు



**వెల్దండ, డిసెంబర్ 3 ప్రభాతవార్త:**వెల్దండ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా ఎంఈఓ చంద్రుడు ఆధ్వర్యంలో దివ్యాంగుల పాఠశాల పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి పాల్గొన్న ప్రతి విద్యార్థికిబహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ చంద్రుడు మాట్లాడుతూ దివ్యాంగులు అన్నిరంగాలలో రాణిస్తున్నారని, ఏమాత్రం అధైర్య పడకుండా ధైర్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సునీత దాసు ఉపాధ్యాయులు సరిత, తిరుపతయ్య, బాలయ్యగౌడ్, సిఆర్పి ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## మండలంలో సర్పంచ్‌ల నామినేషన్లు 20, వార్డులకు 32 నామినేషన్ల దాఖలు

### నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన మండల నోడల్ అధికారి, తహసీల్దారు వీరభద్రప్ప



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న నోడల్ అధికారి

**ఇటిక్యాల డిసెంబర్3, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలో ఉమ్మడి ఇటికల మండలం కొత్త ఎర్రవల్లి మండలంలోని 29 గ్రామపంచాయతీల సర్పంచులకు. వార్డు నెంబర్లకు మూడవ విడత ఎన్నికలు నిర్వహిస్తుండగా బుధవారం మొదటి రోజు ఉమ్మడి మండలంలో ఉమ్మడి మండలంలోని 7 నామినేషన్ కేంద్రాలలో రిటర్నింగ్ అధికారులకు ఇటిక్యాల మండలం లో 6 సర్పంచులకు. 12 వార్డులకు ఆయా గ్రామాల నుండి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశా రు. అలాగే కొత్త ఎర్రవల్లి మండలంలో 14 సర్పంచులకు. 20వార్డు మెంబర్లకు ఆయా గ్రామాల నుండి అభ్యర్థులు నామినే షన్లను రిటర్నింగ్ అధికారులకు దాఖలు చేశారు. మండలంలోని సాతర్ల గ్రామంలో సర్పంచు ఎస్సీ మహిళలకు కేటాయించగా ముగ్గురు మహిళలు నామినేషన్లను దాఖలు చేశారు. అలాగే చాగపురం కేంద్రం నుండి సర్పంచుగా 1.ఇటిక్యాల నుండి సర్పంచులుగా 2నామినేషన్లు దాఖలు చేశారు. ఎర్ర వల్లి మండలంలోని ఎర్రవల్లి క్లస్టర్ నుండి సర్పంచులుగా8.ధర్మవరం కేంద్రం నుండి 3.కోదండ పురం నామినేషన్ కేంద్రం నుండి 3సర్పంచు అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు.నామినేషన్ కేంద్రాలనుమండలనోడల్అధికారితహసిల్దారు వీరభద్రప్పఇటిక్యాల.చాగాపురం నామినేషన్ కేంద్రాలను పరిశీలించి ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థుల నుండి నామినేషన్లను స్వీకరిం చాలని రిటర్నింగ్అధికారులకుసూచించారు.ఉదండపురంనామినేషన్‌కేంద్రంలో రిటర్నింగ్ అధికారిగా శ్రీనివాసులు.అసిస్టెంట్ టర్నింగ్అధికారిగా వెంకటరమణారెడ్డినామినేషన్లను తీసుకున్నారు. ఆయా పంచాయతీలు నామినేషన్లు వేసేకేంద్రాల వద్దసంబంధిత పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తూ పోటీ చేసేఅభ్యర్థులకు ఇంటిపన్ను కట్టించుకొని అభ్యర్థులకు నోడ్యూ సర్టిఫికెట్ జారీ చేస్తున్నారు.

## చౌదర్‌పల్లి గ్రామపంచాయతీ ఏకగ్రీవం



ఏకగ్రీవమైన సర్పంచ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**వెల్దండ, డిసెంబర్ 3 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని చౌదర్‌పల్లి గ్రామపంచాయతీ జనరల్ స్థానంగా కేటాయించడంతో గ్రామానికి చెందిన 8 మంది అభ్యర్థులు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి, లోడిగా తిరుపతయ్య, కొండల్ యాదవ్, నల్లబోలు సురేష్‌రెడ్డి, గూడాల జగదీశ్వర్, కావటి మోహన్, మారేపల్లి రమేష్‌లు నామినేషన్లు దాఖల్ చేశారు. బుధవారం నామినేషన్ ఉపసంహరణ చివరి రోజు 7 మంది ఉపసంహరించుకోవడంతో బరిలో సుంకిరెడ్డి కృష్ణారెడ్డి ఒకరే నిలువగా చౌదర్‌పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా సుంకిరెడ్డి కృష్ణారెడ్డి ఏకగ్రీవమయ్యారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి కృష్ణారెడ్డి ఈ అవకాశం కల్పించిన గ్రామస్తులందరికీ ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలుపుతున్నానని గ్రామాన్ని ప్రజలందరి సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చుకుందామన్నారు. ఇప్పటికే వీరి తనయుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి టాస్క్ సిఓఓ ఐక్యత ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలో విస్తృతమైన సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గానికి సుపరిచితులుగా ఉన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



గోవర్ధనగిరిలో కార్యకర్తలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**వీపనగండ్ల డిసెంబర్ 3, ప్రభాతవార్త:** మూడవ విడత సర్పంచ్ స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు జూపల్లి అరుణ్ కళ్యాణ్ రామ్ ఓటర్లకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం నాడు గోవర్ధనగిరి గ్రామానికి కార్యకర్తలను కలవడానికి వచ్చిన వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎన్నో అభివృద్ధి పథకాలను అమలు చేయడం జరిగిందని వాటిని అందుకుంటున్నటువంటి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఎత్తున ఓటింగ్ ఇచ్చి సర్పంచులుగా వార్డు మెంబర్లుగా గెలిపించాలని వారు ప్రజలను కోరారు. కార్యకర్తలు కూడా ఎలాంటి వైశ్యమేలు లేకుండా పార్టీ నిలబెట్టినటువంటి వ్యక్తులకు సహకరించి సపోర్టు చేసి ఓట్లు పడే విధంగా కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని వారు తెలిపారు.ఉచిత బస్సు ప్రయాణం మహిళలకుగ్యాస్ సిలిండర్ల పథకాలు విద్యుత్తు గృహపకర పథకాలను తదితర వాటిని ఓటర్లకు వివరించాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. వివిధ గ్రామాలలో అభ్యర్థుల ఎంపికలో పాలుపంచుకుంటున్నట్లు వారు తెలిపారు వీరి వెంట స్థానిక నాయకులు మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి భుజల బాల్రెడ్డి తోపాటు గోవర్ధనగిరి సర్పంచ్ అభ్యర్థి అయిన సురేందర్ బాబు బొలమోని వెంకటస్వామి గోపాల్దిన్నె కురుమయ్య పెంటయ్య తదితర కార్యకర్తలు ఉన్నారు.

## పెబ్బేరు చెక్‌పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ




పెబ్బేరు చెక్ పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ సునీత రెడ్డి

**వనపర్తి, డిసెంబరు 3 ప్రభాతవార్త:** గ్రామపంచాయతి ఎన్నికల నేపథ్యంలో పెబ్బేరు నుండి కొల్లాపూర్ వెళ్లే మార్గంలో చెక్‌పోస్ట్‌ను జిల్లా ఎస్పీ సునీత రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల తనిఖీలు, రిజిస్టర్ నమోదులు, సిబ్బంది అప్రమత్తత, నిఘా విధానాలను ఆమె దగ్గరుండి పరిశీలించి, ఎన్నికలను ప్రభావితం చేసే నగదు, మద్యం, బంగారం వంటి ఏ చట్టవిరుద్ధ రవాణాకైనా జిల్లాలో స్థానం లేదని ఆమె స్పష్టం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చట్టాన్ని అతిక్రమించే వారెవరైనా ఎలాంటి ఉపశమనం లేదు. వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అనుమానాస్పద కదలికలు గమనించినప్పుడల్లా ప్రజలు పోలీసులకు వెంటనే తెలియజేయాలని ఆమెవిజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు, పెబ్బేర్ ఎస్సైలు యుగంధర్ రెడ్డి, దివ్య పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నామినేషన్ల స్క్రూటినీ పరిశీలించిన కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు3 ప్రభాతవార్త:** రెండోవ దశ నామినేషన్ల స్క్రూటిని బుధవారం కోయిలకొండ మండలంలో కోయిలకొండ క్లస్టర్ 5లో కోయిలకొండ, ఆచార్యపూర్, ఇబ్రహీంనగర్, వీరంపల్లి, సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థుల నామినేషన్ల స్క్రూటిని కలెక్టర్ విజయేందిరబోయి పరిశీలించారు. రిటర్నింగ్ అధికారులను స్క్రూటిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత నామినేషన్ల స్క్రూటిని ఆన్లైన్ పద్ధతిలో చేసే విధానాన్ని పరిశీలించారు అప్లోడింగ్ ఎలా చేస్తారు? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయంలో పోలింగ్ సామాగ్రిని పరిశీలించి అధికారులతో పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ ఎలాజరుపుతారు అని ఎక్కడ జరుపుతారని అడిగారు. పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కు పక్కాగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. తర్వాత పోస్టల్ బ్యాలెట్ గురించి ఆరా తీశారు. ఎన్నికల విధులలో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చూడాలని తెలిపారు.

## చిన్నరాజమూర్ అంజన్న ఉత్సవాలు ప్రారంభం

**దేవరకద్ర, డిసెంబరు3 ప్రభాతవార్త:** జిల్లాలో ప్రసిద్ధి చెందిన చిన్న రాజమూర్ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమై, బుధవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహణం చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆలయంలో వేద పండితులు హోమం అనంతరం పంచామృతాభిషేకం, అలంకరణ, రాత్రికి అశ్వ వాహన సేవ, బ్రహ్మోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో శ్యాంసుందర్ చారి, ఆలయ చైర్మన్ రాఘువేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

### దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళితే ఏదైనా సాధించవచ్చు : అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ




సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

**గద్వాల టౌన్ డిసెంబర్3, ప్రభాతవార్త:** దివ్యాంగులు తమపై తమకు నమ్మకం, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే ఏ రంగంలోనైనా విజయాలు సాధించవచ్చు అని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ (రెవిన్యూ)అన్నారు.బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంను పరిష్కరించుకొని గద్వాల ఇండోర్ మైదానంలో మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో అదనపు కలెక్టర్ నర్సింగరావు (స్థానిక సంస్థలు)తో కలిసి లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని,వారి హక్కులను కాపాడేందుకు వివిధ చట్టాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చేవారికి ప్రత్యేక సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతినెల చివరి రోజున ఆయా మండలాల్లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని, అక్కడ దివ్యాంగుల హక్కుల గురించి కూడా వివరించేలా సంబంధిత తహసీల్దారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో మహిళ వికలాంగ సంఘాలు కూడా ఏర్పాటు చేసి సభ్యుల ఉపాధి నిమిత్తం ప్రత్యేక రుణాలు అందజే సేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దివ్యాంగులకు కొత్త పెన్షన్లు మంజూరు చేసే విషయం ప్రభుత్వం నిర్ణయిస్తుందన్నారు. ప్రతినెల సదరన్ క్యాంపులకు వచ్చే దివ్యాంగులకు వారి గ్రామాల నుంచి ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి సహకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అంతకుముందు పలువురు దివ్యాంగ సేవ సంఘం నేతలు మాట్లాడారు. అనంతరం దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులు అందజేశారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు దివ్యాంగులను సన్మానించారు.అంతకుముందు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గాంధీ చౌక్ నుంచి ఇండోర్ స్టేడియం వరకు నిర్వహించిన ర్యాలీలో దివ్యాం గులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అంతకుముందు వైయస్సార్ చౌక్ వద్ద మానవహారంనిర్వహించిర్యాలీగా బయలుదేరి ఇండోర్ స్టేడియంకు చేరుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని సునంద, విద్యాశాఖ అధికారిని విజయలక్ష్మి, డివైఎస్ఓ కృష్ణయ్య, డిఆర్డిఏ ఏపీడి శ్రీనివాసులు, డిసిపిఓ నరసింహా, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ప్రతినిధులు శ్రీనివాసులు, లక్ష్మణ స్వామి, జిల్లా దివ్యాంగుల సేవాసంఘం అధ్యక్షులు చంటిబాబు, బీసమ్మ, లక్ష్మీకాంతరెడ్డి, నరసింహులు, ఆంజనేయులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన దివ్యాంగులు

## విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలి



విద్యార్థుల ఆరోగ్యస్థితిని అడిగి తెలుసుకుంటున్న న్యాయమూర్తి లక్ష్మీ

**గద్వాల టౌన్ డిసెంబర్3, ప్రభాతవార్త:** గిరిజన వసతి గృహంలో తనిఖీ సందర్భంగా వంటగది, వంట సరుకుల నాణ్యత, నిల్వ విధానం, వంట పరిశుభ్రతను న్యాయమూర్తి టి. లక్ష్మి సమగ్రంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై వారి ఆరోగ్య పరిస్థితి, ఆహార నాణ్యత, రోజువారీ సమస్యలు, చదువు, వసతి గృహంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు వంటి అంశాలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలోని భౌతిక సదుపాయాలను పరిశీలించగా, తాగునీటి కోసం ఆర్ఓ ఫిల్టర్ లేకపోవడం వల్లవిద్యార్థులు తాగుతున్న నీటినాణ్యతపై సందేహాలు ఉత్పన్నమయ్యాయి. భవనం మొత్తంగా శిథిలావస్థలో ఉండడం, కొంతభాగం జారిపడే స్థితిలో ఉండడం విద్యార్థుల ప్రాణాపాయ భద్రతకు ముప్పుగాఉందని గుర్తించారు. బాత్రూములు శుభ్రంగా లేకపోవడం, నీరు నిల్వ ఉండడం, సరైన శానిటేషన్ సదుపాయాలు లేమి, అలాగే రూముల పైకప్పులు పెచ్చులూడిపోవడం వంటి సమస్యలు స్పష్టంగా దర్శనమిచ్చాయి. దీనితో పాటు విద్యార్థులు నిద్రించే గదుల్లో వెలుతురు, గాలి ప్రసరణ, పడకల పరిస్థితులు కూడా సరైన స్థాయిలో లేవని గుర్తించారు. మరియు వసతి గృహ నిర్వహణపై పరిశీలనలు చేశారు.తనిఖీ సందర్భంగా గౌరవ న్యాయమూర్తిగారు, పై లోపాలపై సంబంధిత సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, హాస్టల్‌వార్డెన్, అలాగే ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ను పిలిపించి, ఆహార నాణ్యత, శుద్ధి ప్రమాణాలు భవనం భద్రతపైఎందుకు నిర్లక్ష్యం జరిగిందో వివరాలు కోరారు. గుర్తించిన లోపాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సురక్షిత వాతావరణం,ఆరోగ్యకరమైన ఆహారంఅందేందుకు తగిన ఏర్పాట్లు వెంటనే చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ తనిఖీ వివరాలను, గుర్తించిన సమస్యలను, బాధ్యుల వివరణలను, సూచించిన సరిదిద్దు చర్యలను ఒక సమగ్ర నివేదిక రూపంలో తయారు చేసి సంబంధిత ఉన్నతాధికారులకు సమర్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చర్యలు ప్రారంభించింది.ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ వి.రాజేందర్, బి. శ్రీనివాసులు, డి. లక్ష్మణ స్వామి పాల్గొన్నారు.

## నామినేషన్ వేయకుండా చేస్తున్నారని కలెక్టర్ ఫిర్యాదు



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజశ్రీ గార్లపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు అల్లా బకాష్

**ఇటిక్యాల డిసెంబర్3, ప్రభాతవార్త:** ఉమ్మడి ఇటిక్యాల మండలం, కొత్తగా ఏర్పడిన ఎర్రవల్లి మండలంలోని రాజశ్రీ గార్లపాడు గ్రామంలో ప్రజాస్వామ్యబద్ధంగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించకుండా డబ్బుతో వేలం వేసి ఎన్నిక జరగకుండా ప్రజాస్వామ్యాన్ని అపహ్యాం చేస్తున్నారని బుధవారం అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు అల్లా బకాస్ జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్..మరియు జిల్లాఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు.. ఫిర్యాదులో కొత్త ఎర్రవల్లి మండలంలోని రాజశ్రీ గార్లపాడు గ్రామంలో పంచాయతీ ఎన్నికలు ఏకగ్రీవం చేయాలని కొందరు నాయకులు డబ్బుతో వేలం వేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఈ సందర్భంగా ఈ సందర్భంగా మా గ్రామ యువకుడు నామినేషన్ వేయడానికి వెళుతుండగా కొందరు నాయకులు యువకుడిని ఒకగ్రామ సమీపంలోని కోళ్ల ఫారం వద్దకు తీసుకుపోయి బెదిరించి నామినేషన్ వెయ్యకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో వివరించారు.అలాగే నామినేషన్ వేయడానికి వస్తే అభ్యర్థిని బెదిరిస్తున్నారని అందువల్ల మా గ్రామ ఆర్గార్లపాడు గ్రామంలోప్రజాస్వామ్యబద్ధంగా సర్పంచ్.వార్డ్ మెంబర్లకు ఎన్నికలు జరిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు అల్లబకాష్ కలెక్టర్ ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. అంతేకాక తాను కూడా నామినేషన్ వేయడానికి సిద్ధమవుతుండగా భయభ్రాంతులకు గురి చేస్తూ కిడ్నాప్ చేస్తామని బెదిరిస్తున్నారని అందుకు నాకు రక్షణ కల్పించి నేను నామినేషన్ వేసేందుకు రక్షణ కల్పించాలని వినతి పత్రంలో ఫిర్యాదుదారుడు అల్లా బకాష్ వివరించారు.

## మరమ్మత్తులకు నోచుకోని కాలువ బ్రిడ్జి



మరమ్మత్తులకు నోచుకోని కాలువ బ్రిడ్జి

**నారాయణపేట, డిసెంబరు3 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణ కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో లింగయ్య దేవాలయం సమీపంలో ఉన్న కాలువ బ్రిడ్జి తీవ్రంగా దెబ్బతినడంతో స్థానికులలో ఆందోళన పెరుగుతోంది. దెబ్బతిన్న బ్రిడ్జ్‌పై వాహనాలు ప్రయాణించే సమయంలో పలువురు స్కిడ్ అయ్యి కిందపడిన సంఘటనలు చోటుచేసుకున్నాయని నివాసులు తెలిపారు. రాత్రి వేళల్లో పనిచేయని వీధి దీపాలు ఈ సమస్యను మరింత తీవ్రమవ్వడానికి కారణమవుతున్నాయి. గత రెండు వారాలుగా బ్రిడ్జ్ స్థితి క్రమంగా క్షీణించిపోతుండడంతో, ఏ క్షణంలోనైనా మొత్తం బ్రిడ్జి కూలిపోవచ్చనే భయం ప్రజల్లో నెలకొంది. ఈ మార్గం మీదుగా ప్రతిరోజూ శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాల బస్సు,అనేక ద్విచక్ర,భారీవాహనాలు నిరంతరం ప్రయాణిస్తున్నాయి. బ్రిడ్జ్ పక్కనున్న డ్రైనేజీలో వాహనాలు జారిపడే ప్రమాదం ఉన్నందున వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా, రాత్రివేళల్లో వీధి దీపాలు పనిచేయకపోవడం వల్ల వృద్ధులు,మహిళలు,పిల్లలు, పాదచారులు మరియు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. చీకటిలో రోడ్డు స్పష్టంగా కనిపించక ప్రమాదాల ముప్పు పెరిగిందని తెలిపారు. బ్రిడ్జ్, రోడ్డు మరమ్మత్తులు వీధి దీపాల పునరుద్ధరణ కోసంపలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత శాఖఅధికారులు తక్షణమే చర్యలు తీసుకొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.

## 8వ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సిసి వార్షిక శిక్షణ శిబిరం

### జెపిఎన్‌సిఇలో విజయవంతంగా ముగింపు



ఎన్‌సిసి వార్షిక శిక్షణ శిబిరంలో ఎన్‌సిసి సభ్యులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు3 ప్రభాతవార్త:** కల్నల్ ప్రశాంత్ కుమార్8వ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సిసి ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక శిక్షణ శిబిరం ఎటిసి 11 (అన్యూవల్ ట్రైనింగ్ క్యాంప్-11) జెపిఎన్‌సి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విజయవంతంగా ముగిసింది. నవంబర్ 25 నుంచి ప్రారం భమైన ఈ పది రోజుల శిబిరంలో మొత్తం 519 మంది కేడెట్లు వివిధ పాఠశాలలు, కళాశాలల నుండి పాల్గొన్నారు. శిబిరంలో పాల్గొన్న కేడెట్లకు మ్యాప్ రీడింగ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, కమ్యూనికేషన్, ఫీల్డ్‌క్రాఫ్ట్, ఫైర్‌ఫైటింగ్, ఫైరింగ్ తదితర విభాగాల్లో ప్రత్యేక శిక్షణను అందించారు. క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావన పెంపొందించే విధంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. అంతేకాక, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన కార్యక్రమంలో అనేక మంది కేడెట్లు రక్తదానం చేసి సేవాభావాన్ని ప్రదర్శించారు. శిబిరాన్ని 8వ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్‌కల్నల్ ఎస్‌కె.సింగ్ పర్యవేక్షించారు. అలాగే హైదరాబాద్ గ్రూప్ ఎన్‌సిసి కమాండర్ కల్నల్ ప్రశాంత్ కుమార్ శిబిరాన్ని సందర్శించి శిక్షణ కార్యక్రమాలను పరిశీలిం చారు. కేడెట్లతో ముచ్చటించిన ఆయన దేశసేవలో ఎన్‌సిసి పాత్రను వివరించి, నిబద్ధతతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. ఈ శిబిరం ద్వారా కేడెట్లు శారీరక దృఢత్వంతో పాటు సేవా భావం, నాయకత్వ నైపుణ్యాలు, అత్య వసర పరిస్థితుల్లో స్పందించే సామర్థ్యాలను అలవర్చుకున్నారని నిర్వాహకులు తెలిపారు.



## శ్రీసిద్ధి వినాయక స్వామివారి పూజలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే



**దేవరకద్ర,డిసెంబరు 3 ప్రభాతవార్త:** శ్రీ సిద్ధి వినాయక స్వామివారి షష్ఠమ వార్షిక బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. బుధవారం కౌకుంట్ల మండల కేంద్రంలోని పుట్టపల్లి గ్రామంలో శ్రీ సిద్ధి వినాయక దేవాలయం శ్రీ లక్ష్మి వెంకటేశ్వర వేర్ హోసింగ్ పిఎస్టీ గోదాంలో నిర్వహించిన షష్టమ వార్షికబ్రహ్మోత్సవాల పూజ కార్యక్రమంలో పాల్గొని,స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని శ్రీలక్ష్మి వెంకటేశ్వర వేర్ హౌసింగ్ పిఎస్టీ గోదాం మేనేజింగ్ డైరెక్టర్లు మాదాడి కృష్ణారెడ్డి, సుధీర్‌రెడ్డి, రాముశాలు వాతో ఘనంగా సన్మానించారు.తదనంతరం గోదాం లోని మహిళలు దేవరకద్ర ఎమ్మెల్యేకు స్వాగతం పలికి, సెల్ఫీలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ దాఖలు

**ఉప్పునుంతల, డిసెంబరు 3 ప్రభాతవార్త :** గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలోబుధవారం మండలంలో నామినేషన్ల ప్రక్రియను ఏడు క్లస్టర్లుగా ఏర్పాటుచేయగా తొలిరోజు సర్పంచులకు 19,వార్డు 11 సభ్యులకు నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా సహాయ ఎన్నికల అధికారి, ఎంపిడిఓ వరుణ్ తేజతెలిపారు. అందులో క్లస్టర్ల వారిగా సర్పంచుల నామినేషన్లు దాఖలైన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పునుంతల క్లస్టర్ పరిధిలో ఉప్పునుంతల, దేవదారి కుంట తండా, కంసానిపల్లి, కంసాని పల్లి తాండలకు 03 నామినేషన్లు దాఖలుకాగా, పిరట్వాన్ పల్లి క్లస్టర్ పరిధిలో పిరట్వాన్ పల్లి, అయ్యవారిపల్లి, రాయిచేడ్‌లకు వార్డు సభ్యులకు 01, జప్తిసదగోడు క్లస్టర్ పరిధిలో సదగోడు,తిరుమలాపూర్, మొల్గర, పెద్దాపూర్ గ్రామ పంచాయతీల పరిధిలో సర్పంచులకు04, వెల్టూర్ క్లస్టర్ పరిధిలో వెల్టూరుకు, సూర్య తండాకు, తాడూరుకు, తిప్పాపూర్, కొరటికల్లుసర్పంచులకు 4 వార్డులకు4, గువ్వలోనిపల్లిక్లస్టర్ పరిధిలో గువ్వలోనిపల్లి,ఈరట్వాన్‌పల్లి,లత్తిపూర్‌సర్పంచులకు 03, పెనిమిళ్ళ క్లస్టర్ పరిధిలో పెనిమిళ్ళ, సిబి తాండ, సూర్య తండా సర్పంచులకు 3,వార్డు సభ్యులకు 5 ,లక్ష్మాపూర్ క్లస్టర్ పరిధిలో లక్ష్మాపూర్,దాసర్లపల్లి,మామిళ్ళపల్లి, ఉప్పరపల్లి, మర్రిపల్లి సర్పంచులకు 2, వార్డు 01 నామినేషన్లు దాఖలు అయినట్లు జిల్లా సహాయ ఎన్నికల అధికారి, ఎంపిడిఓ వరుణ్ తేజ వివరించారు.

## వాల్మీకి పూజారులకు వస్త్రాల పంపిణీ



**మల్దకల్ డిసెంబర్3,ప్రభాతవార్త;** ఆదిశేలాక్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్వారి అరవిందరావు, పట్వారి అనిల్ ఆధ్వర్యంలో 300 మంది వాల్మీకి పూజారులకు వస్త్రాలు అందజేశారు. దేవాలయ కళ్యాణమండపం లో జరిగిన ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు, ఈవోసత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో వాల్మీకి పూజారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో సీతారాంరెడ్డి, మాజీ ఎంపీపీ మధుసూదన్ రెడ్డి, అర్చకులు రమేష్ చారి, మధుసూదన్ చారి, రవి, సోమేంద్ర, చంద్రశేఖర రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన మూడవ విడత సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లు

**లింగాల, డిసెంబరు3 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 23 గ్రామ పంచాయతీలకు సంబంధించిన సర్పంచ్ నామినేషన్‌లు 8, వార్డు సభ్యుల నామినేషన్లు 16 వచ్చినట్లు ఎంపిడిఓ చంద్రశేఖర్ తెలిపారు. లింగాల క్లస్టరులో లింగాల 1, పద్మనపల్లి 1 నామినేషన్లు దాఖలైనట్లు, అదే విధంగా లింగాల వార్డు సభ్యుల నామినేషన్లు 1 వచ్చినట్లు తెలిపారు. సూరపూర్ క్లస్టరులో సర్పంచ్ నామినేషన్లు కొత్తకుంటపల్లి నుంచి1, వార్డు సభ్యుల నామినేషన్లు దాఖలు కాలేదు. అంబట్‌పల్లి క్లస్టరులో సర్పంచ్ నామినేషన్లు అంబట్ పల్లి నుంచి 1 ,శాయిన్ పేట నుంచి 1 దాఖలైనట్లు, వార్డు సభ్యుల నామినేషన్లు అంబట్ పల్లి నుంచి 3నామినేషన్లు వచ్చినట్లు తెలిపారు. రాయవరం క్లస్టరులో ఒక్క నామినేషన్‌దాఖలు కాలేదు. అప్పాయిపల్లి క్లస్టరులో అప్పాయిపల్లి నుంచి సర్పంచ్ నామినేషన్లు1,వార్డు సభ్యుల నామినేషన్లు అప్పాయిపల్లి నుంచి 5 దాఖలు అయ్యాయి. రాంపూర్ క్లస్టరులో రాంపూర్‌నుంచి సర్పంచ్ నామినేషన్లు 1,బాకారం నుంచి 1 వార్డు సభ్యుల నామినేషన్లు దాఖలు అయ్యాయి. కోమటికుంట క్లస్టరులోకోమటికుంట సర్పంచ్ నామినేషన్లు1,కోమటికుంట నుంచి వార్డుసభ్యుల నామినేషన్లు 6,అప్పపూర్ పెంటలో ఒక్క నామినేషన్ కూడా దాఖాలు కాలేదని ఎంపిడిఓ చంద్రశేఖర్ తెలిపారు.

## పర్మిషన్‌లేని పర్మిట్‌రూంలు

**మొదటి పేజీ తరువాయి భాగం..**

తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తుండడంతో బెల్టుషాపుల యజమానులు ప్రతి మద్యం బాటిల్‌పై రు.పాతిక,యాభై ఎక్కువ రేట్లతో తమ విక్రయాలు యధేచ్ఛగా సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్న గ్రామీణ బెల్టుషాపులు:** స్థానిక సంస్థల సర్పంచులు,వార్డుల సభ్యులఎన్నికలు మరోవారం రోజులలో జరుగుతున్న నేపథ్యంలో పది రోజుల క్రితమే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది.అయితే ఎన్నికలు జరిగే గ్రామాల్లో ఎన్నికల కోడ్ బెల్టుషాపుల యజమానులు ఉల్లంఘిస్తున్నారన్న ఆరోపణలు వివవస్తు న్నాయి.వేళాపాళా లేకుండా రాత్రిళ్లు మద్యం విక్రయాలు జోరుగా జరుపుతున్నట్లు కూడా సమాచారం.రాత్రి పది దాటిన తర్వాత కూడా బెల్టుషాపులు మద్యం విక్రయాలు జోరుగా సాగిస్తుండడంతో మందుబాబుల చిందులు గ్రామాల్లో విపరీతమై శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్నారనే విమర్శలు లేకపోలేవు. పర్యవేక్షించాల్సి నఎక్సైజ్‌శాఖ అధికారులు,శాంతిభద్రతలు కాపాడాల్సి న పోలీసులుఅస్స లుపట్టించు కోవడంలేదనే ఆరోపణలు కూడా బాహాటంగా వినవస్తున్నాయి.ప్రతీ గ్రామంలోపది వరకు బెల్టు షాపులున్నట్లు తెలుస్తోంది.మండలంలోవందకుపైగా బెల్టు షాపులు ఉంటాయి.ఈ బెల్టుషాపులకు అడ్డు,అదుపూ లేకపోవడం తో గ్రామాల్లో మద్యం విక్రయాలు మూడు పువ్వులు ఆరు కాయ లుగా సాగుతున్నాయి.బెల్టుషాపులపైఉక్కుపాదం మోపాల్సి న అవసరమెంతైనా ఉందని పలువురు తమ అభిప్రాయం వ్యక్తమౌతోంది.

## ఎక్కడి వడ్లు అక్కడే...

**మొదటి పేజీ తరువాయి భాగం..**

నిర్వహించగా ఇక్కడ కూడానిర్వాహకులు సరైనా ఏర్పాట్లు చేయడంలో నిరక్ష్యం చేస్తున్నారని,తూకాలలో చేతివాటం చూపుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాం.సంబధిత అధికారులు స్పందించి వడ్ల కేంద్రాలను పర్యవేక్షించిరైతుకు నష్టంజరగకుండా, వాతావరణ పరిస్థితులనుదృష్టిలో పెట్టుకొని వరిధాన్యం వర్షాల పాలు కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, సెంటర్లలో ధాన్యం త్వరిగతిన తరలించెందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

### గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కాత్యాయని దేవి





నామినేషన్ల స్క్రూటినిని పరిశీలిస్తున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 3 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా లో మూడవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ బుధవారం ప్రారంభమైంది. బుధవారం భూత్పూర్ మండలం అన్నా సాగర్ 1 క్లస్టర్,మూసాపేట మండలం జానం పేట క్లస్టర్ గ్రామ పంచాయతీలను తనిఖీ చేసి సర్పంచ్,వార్డ్ సభ్యుల,స్థానాలకు నామినేషన్ స్వీకరణ ప్రక్రియను గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కాత్యాయని దేవి, పరిశీలించారు. సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నిక కోసం జారీ చేసిన నోటిఫికేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్ని కల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ,నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని, విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా అమలయ్యేలా చూడాలని, నిర్ణీత గడువు లోపల నామి నేషన్ లు స్వీకరించేందుకు టోకెన్లు జారీ చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఖర్చుల వివరాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. వ్యయ పరిమితిని పక్కాగా లెక్కిం చేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. జానంపేట మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠ శాల పోలింగ్ కేంద్రంలో పోలింగ్‌కు కావలసిన అన్ని ఏర్పాట్లు చేయాలని సబ్ ఇన్స్‌పెక్టర్, ఎంపిడిఓ, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మహమ్మదాబాద్ మండలంలో ఎంపిడిఓ కార్యాలయంలో పోలింగ్ సామగ్రి పరిశీలించి ఎన్నికలు సజావుగా నిర్వహించేలా పోలింగ్ సామాగ్రి పరిశీలించి సరి చూసుకోవాలని సూచించారు.

# బిడ్డకు ప్రేమతో..

### నవజాత శిశువుల తల్లులకు యెన్నం హెల్త్ కిట్ అందజేత

- **నవజాత శిశువుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి**
- **ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



యెన్నం అన్న హెల్త్ కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** నవజాత శిశువుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మహబూబ్ నగర్ నియోజకవర్గానికి చెందిన నవజాత శిశువుల తల్లులకు యెన్నం అన్న హెల్త్ కిట్ లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన ప్రతి తల్లికి ఈ ..యెన్నం అన్న హెల్త్ కిట్.. పంపిణీ చేయడం జరుగుతుందని,ఇది పూర్తిగా నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. నవజాత శిశువుల ఆరోగ్యమే లక్ష్యంగా ఈ హెల్త్ కిట్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నవజాత శిశువు ఆరోగ్యం కుటుంబ ఆరోగ్యానికి పునాది అని, శిశువు పొందే ప్రాథమిక సంరక్షణ, పోషకాహారం, శుభ్రత వంటి అంశాల్లో అలస్యముండకూడదని. అందుకే ఈ హెల్త్ కిట్‌ను ప్రసవానంతరం వెంటనే అందించడం ద్వారా ఉపయోగకరమైన సహాయం అందించాలనుకుంటున్నాం" అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సేవల మెరుగుదలకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కూడా ఆయన ఈ సందర్భంగా వివరించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోజువారీగా పెరుగుతున్న ప్రసవాల సంఖ్య దృష్ట్యా సిబ్బంది, వైద్య వనరులను మరింతగా బలోపేతం చేయడానికి చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగ అజ్మీర మాట్లాడుతూ, ప్రసవానంతర దశలో తల్లి–శిశు ఆరోగ్యం అత్యంత కీలకమని, ఈ కిట్లు ప్రాథమిక సంరక్షణలో తక్షణ సహాయాన్ని అందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేంద్ర, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ వ్యవసాయ విద్యా దినోత్సవం




**పెద్దమందడి, డిసెంబరు3 ప్రభాతవార్త:** మోజర్ల ఉద్యాన కళాశాల యన్ఎస్ఎస్ ఆఫీసర్లు కె.భాస్కర్, టి.నవ్యశ్వేత ఆధ్వర్యంలో పెద్దమందడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ వ్యవసాయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులకు వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ డిప్లొమా కోర్సులు, బిఎస్‌సి అగ్రికల్చర్, హార్టికల్చరు, పశు వైద్యం ఇతర వ్యవసాయ అనుబంధకోర్సులలో ఎలా ప్రవేశం పొందాలి. ఉద్యాన, విద్య యొక్క ప్రాముఖ్యతను అసిస్టెంట్ ప్రొ॥భాస్కర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ జగదీష్ బాబు, ఉపాధ్యాయులు కేశవులు, కురుమూర్తి, సాయి చందర్, విజయ్, ఉద్యాన విద్యార్థులు దినేష్, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

# ప్రారంభమైన మూడవ దశ గ్రామపంచాయతీ నామినేషన్లు



నామినేషన్లు దాఖలు చేస్తున్న అభ్యర్థులు

**శ్రీరంగాపూర్, డిసెంబరు3 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండలంలోని గ్రామాలలో మూడో దశ గ్రామపంచాయతీ నామినేషన్లు బుధవారం రోజు ప్రారంభమయ్యాయి. గ్రామపంచాయతీ సర్పంచ్ గా 6 నామినేషన్లు రాగా, 21 వార్డ్ నెంబర్లుగా నామినేషన్లు వేయడం జరిగింది. శ్రీరంగాపూర్ ఎంపీడీవో రవి నారాయణ వివరాల ప్రకారం జానంపేట1 సర్పంచ్ అభ్యర్థిగా,11 మంది వార్డ్ నెంబర్లు గాను, నగరాలయందు 1 గ్రామ సర్పంచ్ గాను, 1వార్డ్ మెంబర్ గాను, నాగసానిపల్లి గ్రామపంచాయతీ నందు ఒకరు సర్పంచ్ గాను, వార్డ్ మెంబర్ ఒకటి, సేరిపల్లి గ్రామ సర్పంచ్ గాఒకరువార్డ్ మెంబర్గాఒకరు, శ్రీరంగాపూర్ గ్రామసర్పంచ్‌గాఒకరు, వార్డ్ మెంబర్‌గా నలుగురు, వెంకటాపురం వార్డు మెంబర్గా ఒకరు నామినేషన్ లు వేయడం జరిగిందని పేర్కొనడం జరిగింది.

# ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహిస్తున్న అధికారులు

**దేవరకద్ర, డిసెంబరు3 ప్రభాతవార్త:** అద్భుతమైన శక్తికి, అసమానమైన దృఢత్వానికి, సృజనాత్మకతకు నిదర్శనంగా, ధైర్యంగా అధిగమిస్తుంది దృఢ సంకల్పానికి ప్రతీకగా కనిపిస్తున్నారు దివ్యాంగులు. ఈ సందర్భంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా దేవరకద్ర మండలంలోని భవిత సెంటర్ దివ్యాంగుల పాఠశాలలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు పాఠ్య పోటీలు నిర్వహించారు. అనంతరం దేవరకద్ర ఎంఈఓ బలరాం. బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ హైస్కూల్ కాంప్లెక్స్ నాగేంద్రమ్మ కోయిల్ సాగర్ కాంప్లెక్స్ రమేష్ , బాలురహై స్కూల్ జిహెచ్‌ఎం రామలింగం, ఎమ్మార్సి హెచ్‌ఎం ఆంజనేయులు, రాధిక, మానస, శోబిత, దివ్యాంగుల ఉపాధ్యాయురాలు అనురాధ తదితరులు పాల్గొన్నారు.



**భూత్పూర్, డిసెంబర్3, ప్రభాతవార్త:** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం భూత్పూర్‌లో ఘనంగా నిర్వహించారు. భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని నాల్గొవార్డు ఇందిరా నగర్‌కాలనీలో ఉన్న దివ్యాంగుల కేంద్రమైన భవిత సెంటర్‌లో మానసిక దివ్యాంగులైన పిల్లలకు మండలవిద్యాధికారిణి ఉషారాణికానుకలు, పరికరాలు, కిట్లు పంపిణీచేశారు. దివ్యాంగులైన బాలలకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఉషారాణి మాట్లాడుతూ దివ్యాంగులను మనం ఆదరించి, వారికి సరైన ప్రోత్సాహమందిస్తే వారు అన్ని రంగాలలో రాణిస్తారన్నారు. సమాజంలో దివ్యాంగులైన బాలబాలికల పట్లరాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించినట్లు చెప్పారు. భూత్పూర్ మండలంలో కొత్తమొల్గర, భూత్పూర్‌లలో రెండు ప్రత్యేక భవిత సెంటర్లు నడుస్తున్నాయని, ఈ రెండు సెంటర్లలో ఇరవై మందికి పైగా, దివ్యాంగులైన చిన్నారులున్నారని పేర్కొన్నారు.

# మూడవ దశ నామినేషన్ ప్రక్రియ మొదలు

**నారాయణ పేట, డిసెంబరు3 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల మూడవ దశ నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. జిల్లాలోని ఐదు మండలాలకు చెందిన 110 గ్రామ పంచాయతీలు పోలింగ్ కోసం కాగా, డిసెంబర్ 3 నాటికి సర్పంచ్ పదవికి మొత్తం 60 నామినేషన్లు దాఖలయ్యాయి. మక్తల్ మండలం అత్యధికంగా 25 నామినేషన్లు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. తరువాత ఉట్కూర్ మండలంలో 14, నర్వ లో 9, మగనూరులో 7, కృష్ణ మండలంలో 5 నామినేషన్లు నమోదయ్యాయి. వార్డు సభ్యుల పోటీలకు సంబంధించి మొత్తం 994వార్డులు పోలింగ్‌కు నోటిఫై చేయగా, ఇప్పటివరకు 66వార్డు నామినేషన్లు సమర్పించబడ్డాయి. ఇందులో మక్తల్ మండలంలో 31, మగనూరులో 17, ఉట్కూర్ 10, కృష్ణలో 6, నర్వలో 2 నామినేషన్లు వచ్చాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల దాఖలు, పరిశీలన, ఉపసంహరణ తదితర దశలు కొనసాగుతుండగా మూడో విడతలో పోటీచేసే అభ్యర్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.



తెలంగాణ ఉద్యమ అమరవీరుడు శ్రీకాంతా చారి వర్ధంతి సందర్భంగా జడ్చర్ల పట్టణం తెలంగాణ చౌరస్తాలో శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పించిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, నాయకులు

జడ్చర్ల, డిసెంబరు3 ప్రభాతవార్త:

# శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు

- సర్పంచ్ చివరి విడత నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ
- వీపనగండ్ల నామినేషన్ కేంద్రంలో భద్రతా వ్యవస్థపై ఆరా
- నామినేషన్ కేంద్రం వద్ద ఒక్క తప్పిదానికి తావుండరాదు



నామినేషన్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ

**వనపర్తి, డిసెంబరు3 ప్రభాతవార్త:** వీపనగండ్ల మండలం గోవర్ధనగిరి గ్రామంలోని సర్పంచ్ మూడో విడత నామినేషన్ కేంద్రాలను జిల్లా ఎస్పీ సునిత రెడ్డి బుధవారం పరిశీలించారు. నామినేషన్ నిర్వహణ, భద్రతాఏర్పాట్లు, సిబ్బందిచర్యలను స్థలంలోనే సమీక్షించిన ఎస్పీ, ఎన్నికల విధుల్లో శాశ్వత అప్రమత్తత, శూన్య సహనం విధానాన్ని పాటించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ సిబ్బందిని ఉద్దేశించి నామినేషన్ కేంద్రాలు ప్రజాస్వామ్య ప్రక్రియకు హృదయ భాగాలు. ఇక్కడ నిర్లక్ష్యం అంటే ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేయడమే. ప్రతి అధికారి, ప్రతి కానిస్టేబుల్ తమబాధ్యతను అత్యంత క్రమశిక్షణతో నిర్వహించాలని హెచ్చరించారు. కేంద్ర పరిసరాల్లో అనుమానాస్పద కదలికలపై వెంటనే క్యూ లైన్‌లలో క్రమశిక్షణ, అభ్యర్థులకు సమాన అవకాశం. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు స్వచ్ఛంగా జరగాలని ప్రజలు కోరుకుంటారు అదే మా సంకల్పం కూడా ఎవరైనా చట్టవిరుద్ధంగా ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తేవారుఎంత ప్రభావశీలులైనా కఠిన చర్యలు తప్పవని గ్రామ శాంతి, సమానత్వం, గౌరవం ఇవే మా లక్ష్యాలని ప్రజలు ధైర్యంగాముందుకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు, వీపనగండ్ల ఎస్సై రాణి, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం

**నాగర్‌కర్నూల్, డిసెంబర్3, ప్రభాతవార్త:** తాడూర్ మండలం ఎట్టిధర్ పల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పెద్దింటి కవిత అర్జున్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామస్తులు పకటించారు. ఈమేరకు పెద్దింటి కవిత అర్జున్‌ను మాజీ శాసన సభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొని బిఆర్ఎస్ పార్టీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# బిఆర్ఎస్ పార్టీ నుండి నలుగురు సర్పంచులు ఏకగ్రీవం

**గత అభివృద్ధిని ఆదరించిన ప్రజలకు అండగా నిలబడతా..**

**ఇది శుభ పరిణామం: మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**



బిఆర్ఎస్ పార్టీ నుండి ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులు

**వనపర్తి, డిసెంబరు3 ప్రభాతవార్త:** మొదటిదశ గ్రామ పంచాయితీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున బలపరిచిన అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. పార్టీకి అండగా నిలిచిన ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, గ్రామాల అభివృద్ధి కోసంకృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఓటమి గెలుపులతో సంబంధం లేకుండా ప్రజల మధ్య ఉంటూ నిరంతరం ప్రజల సమస్యల పట్ల స్పందించామని ప్రజలు బిఆర్ఎస్ పార్టీయే మాకు అండ అని నమ్మి నలుగురు సర్పంచులను ఏకగ్రీవం చేశారని ఇదే ఉత్సాహంతో పార్టీ శ్రేణులు కష్టపడి పని చేసి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి గత ప్రభుత్వ పథకాలను ప్రజలకు గుర్తు చేసి ప్రజల అభిమానాన్ని సంపాదించి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ దుందుభి మోగించాలని పిలుపునిచ్చారు. మొదటి దశలో బీఆర్ఎస్ పార్టీకి ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లు:1.కొడవత్ శాంతి (భర్త: కొడవత్ కృష్ణ నాయక్)గ్రామం: కర్నె తండా, మండలం: ఘన్పూర్ రెండోసారి ఏకగ్రీవ విజయ 2.కేతావత్ చంద్రమ్మ (భర్త: ముదావత్ పందు)గ్రామం: కోతుల కుంట తండా, మండలం: ఘన్పూర్ 3.ముదావత్ కవిత (భర్త: ముదావత్ శంకర్)గ్రామం: అముదాలకుంట తండా, మండలం: గోపాలపేట4.బంగారగ్రామం:లక్ష్మీదేవిపల్లి, మండలం: గోపాలపేట గ్రామీణాభివృద్ధికి బీఆర్ఎస్ పాలనలో అందించిన సంక్షేమ పథకాలను గుర్తుచేసుకుని మా అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రజల విశ్వాసానికి కట్టుబడి పనిచేస్తాం అని మరొక్కసారి ఏకగ్రీవం చేసిన గ్రామాల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# టీబీజీలో అరుదైన మొక్కలు

**జడ్చర్ల, డిసెంబర్3, ప్రభాతవార్త:** జడ్చర్లలోని డా. బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభివృద్ధి చేస్తున్న తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో అరుదైన మొక్కలు అందమైన పూలను పుష్పించాయని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. సుకన్య తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని అడవుల నుంచి సేకరించి నాటిన మొక్కలు కాలానుగుణంగా పువ్వులు పూస్తున్నాయి. అందులో ముఖ్యంగా ఆర్కిడ్‌లు, తెల్ల కలువ, అరుదైన జాతులెన్నో ఉన్నాయని గార్డెన్ సమన్వయ కర్త డా.బి.సదాశివయ్య తెలిపారు. ఆర్కిడ్ జాతులైన హాబినేరియా ఫర్సిఫెర, హాబినేరియా డిజిటేట, జియోడోరం డెన్సిఫ్లోరం, జియోడోరమ్ లాక్సిఫ్లోరమ్, యూలోఫియా గ్రమీనియా, లూసియా జైలానిక, వాండ టెస్టేసియాలు వికసించాయి. వీటితో పాటు సుమారు 12 జాతుల ఇతర ఆర్కిడ్ మొక్కలున్నాయి. ఇవే కాకుండా హెటెరోస్టెమ్మ బెడ్డోమి అనే తీగ జాతి మొక్కను సుమారు 160 సంవత్సరాల తర్వాత నల్లమల అటవీ ప్రాంతంలో డా. సదాశివయ్య, డా. ప్రసాద్ (శ్రీ వెంకటేశ్వర కళాశాల, న్యూఢిల్లీ) లు కనుగొన్నారు. అంతకు ముందు ఇది కేవలం కేరళ ప్రాంతంలో మాత్రమే 160 సంవత్సరాల క్రితం 1862లో గుర్తించబడింది. దీనికి సంబంధించిన హైర్బేరియం (మొక్క నమూనా) కూడా ప్రపంచంలో ఎక్కడా లేదు. దీనిని ఇప్పుడు కళాశాలలోని తెలంగాణ స్టేట్ హెర్బేరియంలో భద్రపరిచారు. ఈ మొక్క ఇప్పుడు బొటానికల్ గార్డెన్ లో వికసించింది. ఇలాంటి అరుదైన మొక్కలెన్నో ఈ గార్డెన్ లో ఉన్నాయని గార్డెన్ సమన్వయకర్త డా. సదాశివయ్య తెలిపారు. వీటన్నిటిని ప్రత్యేకమైన గ్రీన్ నెట్ హౌస్‌లలో సంరక్షిస్తున్నామని వీటి నిర్మాణానికి పూర్వవిద్యార్థులు, దాతల సహకారం ఎంతో ఉందని కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఇలాంటి అరుదైన మొక్కలన్నీ విద్యార్థులకు పాఠ్యాంశాలుగా ఉన్నాయని వీటిని విద్యార్థులు ప్రత్యక్షంగా చూస్తూ నేర్చుకుంటున్నారు అని కళాశాల వృక్షశాస్త్రం విభాధిపతి డా. నర్మద పేర్కొన్నారు. కళాశాలలో పాఠ్యాంశాలలో ఉన్న అరుదైన మొక్కల పెంపకం ద్వారా కళాశాలలో చదువుతున్న విద్యార్థులే కాగా రాష్ట్రంలో నుంచి వివిధ ప్రాంతాల నుండి పలు కళాశాలల విద్యార్థులు ప్రొఫెసర్లు జడ్చర్ల లోని బొటానికల్ గార్డెన్ ను సందర్శించి వాటినీ ప్రత్యక్షంగా చూసి మొక్కల యొక్క ప్రాముఖ్యత వాటి జీవన విధానాన్ని తెలుసుకోవడంతో పాటు పోటీ పరీక్షల్లో ఈ అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందని పలువురు విద్యార్థులు, ప్రొఫెసర్లు పేర్కొంటున్నారు.



# గత ప్రభుత్వంలో విద్యావ్యవస్థ నిర్లక్ష్యం

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** గత ప్రభుత్వం విద్యావ్యవస్థను నిరక్ష్యం చేసిందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగం అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని తమ స్వంత నిధులతో ప్రత్యేకంగా రూపొందించిన క్యూఆర్ కోడ్ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ మహబూబ్ నగర్ నగరంలోని ప్రభుత్వ కొన పాలమూరు, ప్రభుత్వ గాంధీ రోడ్ ప్రభుత్వ మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఐఐటి కళాశాలల్లో ప్రవేశం పొందడానికి ఇది ఒక విలువైన అవకాశం అని పేర్కొన్నారు. నాణ్యమైన చదువు, సరైన మార్గదర్శకత అందితే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా అత్యున్నత స్థాయిలో నిలబడగలరని ఆయన తెలిపారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పై నిరక్ష్యం వల్ల అనేక అవకాశాలు అందని దిశగా పోయాయని, అయితే ప్రజా ప్రభుత్వం ఆ లోటును పూడ్చడానికి కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాలోని ఎక్కువ మంది విద్యార్థులు రాబోయే విద్యా సంవత్సరంలో మన మహబూబ్ నగర్ లోని ఐఐటి కళాశాలలో సీట్లు సాధించి, జిల్లాకు, మీ పాఠశాలకు , తల్లిదండ్రులకు గౌరవం తీసుకురావాలి" అని ఎమ్మెల్యే ఆకాంక్ష వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు బలపడే విధంగా ప్రభుత్వం అందిస్తున్న అన్ని సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల మౌలిక వసతుల నుంచి విద్యార్థుల భవిష్యత్తు సన్నాహకానికి వరకూ సమగ్ర సహాయం అందిస్తామని ఆయన తెలిపారు. ఈ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ పంపిణీ కార్యక్రమానికి ఎఎంఓ దుంకుడు శ్రీనివాస్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వివిధ పాఠశాల, ప్రధానోపాధ్యాయులు అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.